క్లుప్తంగా

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

రేటూరు(కాకుమాను): విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ తెలిపారు. మండలంలోని రేటూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని చెప్పారు. చదువులో వెనుకబడిన వారిని గుర్తించి వారికి ప్రత్యేక బోధన చేపట్టాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయుల పనితీరు, మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థుల హాజరును పరిశీలించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

పారువేటను అడ్డుకోవడం దారుణం

గుంటూరు రూరల్: ఇటీవల అన్నమయ్య జిల్లా రాయచోటిలో వీరభద్రస్వామి పారువేటను అడ్డుకుని, హిందువులపై దాడి చేయడం దారుణమని ఆంధ్రప్రదేశ్ హిందూ చైతన్య వేదిక నేతలు ఖండించారు. అన్ని జిల్లా కేంద్రాల్లో శుక్రవారం ఉదయం 11 గంటలకు అధికారులకు వినతిపత్రం అందజేయనున్నట్లు జిల్లా సంయోజకులు దుర్గాబాబు, వంగా నవీన్‌రెడ్డి, మల్ల శివకృష్ణ తెలిపారు. నగరంలోని ఒక ప్రైవేటు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పారువేటను చూడటానికి వచ్చిన మహిళలపై లాఠీచార్జ్ చేసిన పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నగర సంయోజక్ వీరేంద్ర కుమార్, నగర సహ సంయోజక్ కళ్యాణపు రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలి



గుంటూరు రూరల్: మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని నాబార్డ్ గుంటూరు జిల్లా డైరెక్టర్ శరత్‌బాబు తెలిపారు. నల్లపాడులోని జేఎంజే సాంఘిక సేవా సంస్థ, నాబార్డ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్‌బాబు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా, గ్రూపుల ద్వారా మహిళలు రుణాలు పొంది ఆర్థిక స్థిరత్వాన్ని పొందవచ్చని సూచించారు. మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో లీడాప్ ప్రోగ్రాంలో భాగంగా టైలరింగ్‌లో శిక్షణ పొందిన 90 మందికి, జేఎంజే సంస్థ ద్వారా 20 మందికి కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది లీలాకుమారి, జేఎంజే సంస్థ డైరెక్టర్ సిస్టర్ మేరికుమారి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

నగరంపాలెం: స్థానిక మారుతీ నగర్‌లోని శ్రీ కంచి కామకోటి పీఠ శ్రీ మారుతి దేవాలయ 39వ వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. శ్రీ అలివేలు మంగ, శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. తూర్పు రాజగోపుర కలశాలు స్థాపన చేపట్టారు. మధ్యాహ్నం మహా పూర్ణాహుతి జరిపారు. కలశ ఉద్వాసన చేసి బలిహరణలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో రంగారావు దంపతులు, సురేష్‌రెడ్డి దంపతులు, ఆలయ కమిటీ కార్యదర్శి తంగిరాల శ్రీనివాసరావు, సభ్యులు కొరపాటి రామారావు పాల్గొన్నారు.

13 నుంచి తిరుపతమ్మ తల్లి ఉత్సవాలు



నగరంపాలెం: పాత గుంటూరు సుద్దపల్లి డొంక రోడ్డులోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్యస్వామి 27వ కల్యాణ బ్రహ్మోత్సవాలను ఈనెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆనం సంజీవరెడ్డి తెలిపారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గురువారం తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో గోడ ప్రతులను ఆవిష్కరించారని పేర్కొన్నారు. 13న జల బిందెల కార్యక్రమం, 14న కల్యాణ మహోత్సవం ఉంటుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో సాంబశివరావు, బి.కృష్ణ, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు జీజీహెచ్‌లో మహిళా ఉద్యోగులకు సన్మానం

గుంటూరు మెడికల్: అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకుని గుంటూరు జీజీహెచ్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటనల్ ఆధ్వర్యంలో ఈనెల 8న మహిళా సిబ్బందికి సన్మానం చేయనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ తెలిపారు. జీజీహెచ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిది మంది స్టాఫ్ నర్సులు, ఆరుగురు వైద్యులకు స్టార్ మహిళలుగా గుర్తించి బహుమతులు ప్రదానం చేస్తామని చెప్పారు.

బ్రిడ్జి నిర్మాణానికి కూటమి గ్రహణం

- కొమ్మమూరు చానల్‌పై బ్రిడ్జి నిర్మాణానికి గత ప్రభుత్వం పచ్చ జెండా
- రూ.42.75 కోట్లు మంజూరు
- అధునాతన టెక్నాలజీతో బ్రిడ్జి నిర్మాణానికి ఏర్పాట్లు
- కూటమి ప్రభుత్వంలో నిర్లక్ష్యం
- ప్రమాదభరితంగా తవ్విన గుంతలు



రోడ్డును సగం పైగా లోతుగా తవ్వేసి వదిలేయడంతో ప్రమాదభరితంగా ఉన్న ప్రాంతం



పిల్లర్స్ కోసం తవ్విన ప్రాంతంలోని గుంతలోకి చేరిన నీరు

చేబ్రోలు: కృష్ణా డెల్టాలో రైతులకు సాగునీరు అందజేసే ప్రధానమైన కొమ్మమూరు చానల్‌పై బ్రిటిషు హయాంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. దీని స్థానంలో ఆధునిక టెక్నాలజీతో రూ.42.75కోట్ల ఎన్‌డీబీ నిధులతో నూతన బ్రిడ్జి నిర్మాణానికి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నిర్మాణానికి అనుమతులు ఇవ్వడంతో 2023 ఆగస్టులో బెంగుళూరుకు చెందిన చాంపియన్స్ గ్రూప్స్ చేపట్టింది. మద్రాసు కాలువగా, పడవల కాలువగా పిలిచే కొమ్మమూరు కాలువపై నూతన బ్రిడ్జి నిర్మాణంతో పాటు 40 అడుగుల వెడల్పు రోడ్డును 1.25 కి.మీ మేర నిర్మించే విధంగా పనులు చేపట్టారు. వంతెనతో ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ సమస్యకు పరిష్కారంతో పాటు వాహనదారుల రాకపోకలకు అనుకూలంగా ఉండే విధంగా గత ప్రభుత్వం రూపకల్పన చేసింది.

కూటమి ప్రభుత్వంలో పనుల ఆలస్యం

పనులు వేగవంతంగా జరుగుతున్న తరుణంలో సాధారణ ఎన్నికలు జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గత కొన్ని నెలలుగా పనులు పూర్తిగా నిలిచిపోయాయి. చానల్‌కు ఇరువైపులా వంద అడుగుల లోతు వరకు ఇరవై వరకు పిల్లర్స్‌ను వేశారు. మంచాల వైపు, చేబ్రోలు వైపు పెద్దఎత్తున తవ్వి వదిలేయడంతో ఇనుము తుప్పు పట్టి పోయింది. చేబ్రోలు వైపు పిల్లర్స్‌లోకి చానల్‌లోని నీరు చేరి చెరువును తలపిస్తోంది. రోడ్డు నిర్మాణానికి మార్కింగ్ చేసి, ఉన్న తారు రోడ్డులో సగం వరకు తవ్వేశారు. అనంతరం వర్షాలు రావడంతో అలాగే వదిలేశారు.

నిత్యం ప్రమాదాలు

ప్రస్తుతం వంతెన నిర్మాణ ప్రాంతంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. బ్రిడ్జి రోడ్డు మలుపు కావడంతో సగం వరకు కోసుకుపోయి ఉంది. దీంతో రాకపోకలు సాగించేవారు తరుచుగా ప్రమాదాల బారిన పడుతున్నారు. తవ్విన ప్రాంతంలో గ్రావెల్‌తో మెరక చేయాల్సి ఉంది. పొన్నూరు, గుంటూరు, బాపట్ల, చీరాల, రేపల్లె తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించటానికి ప్రధాన రహదారి కావడంతో స్థానికులతో పాటు ప్రయాణికులు నిత్యం అవస్థలు పడుతున్నారు.

కొమ్మమూరు కాలువ ప్రాముఖ్యత



కొమ్మమూరు చానల్‌పై బ్రిటిష్ కాలం నాటి పురాతన బ్రిడ్జి

కృష్ణా బ్యారేజీ కంటే ముందే కొమ్మమూరు కాలువ 1877లో నిర్మాణం పూర్తయింది. పెద్ద గంజాం వద్ద బకింగ్ హామ్ కాలువలో కలుస్తుంది. విజయవాడ వద్ద కృష్ణా బ్యారేజీ వద్ద నుంచి బయలు దేరిన పశ్చిమ ప్రధాన కాలువ 20కి.మీ దూరంలోని దుగ్గిరాల లాకుల వద్ద మూడుగా చీలుతుంది. వాటిలో ఒకటి కొమ్మమూరు కాలువ కాగా, రెండోది నిజాంపట్నం కాలువ, మూడోది పశ్చిమ గట్టు కాలువ. దుగ్గిరాల లాకుల వద్ద మొదలైన కొమ్మమూరు కాలువ సంగం జాగర్లమూడి, చేబ్రోలు, కొల్లిమర్ల, నర్సాయపాలెం, కారంచేడు, సంతరావూరుల మీదుగా పెద్ద గంజాం చేరుతుంది. కొమ్మమూరు కాలువ నిర్మాణ సమయంలో సాగు 91,162 ఎకరాల ఆయకట్టు ఉండేది. కాలక్రమేణా ప్రస్తుతం 2.15లక్షల ఎకరాలకు పెరిగింది.

పారిశుద్ధ్య పనుల్లో అశ్రద్ధ వద్దు



గుంటూరు రూరల్: పారిశుద్ధ్య పనుల్లో అశ్రద్ధ వద్దని జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్ సిబ్బందికి చెప్పారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం మండలంలోని లాలుపురం, మల్లవరం, తురకపాలెం గ్రామాల్లో జరిగిన ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలని గ్రామస్తులకు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం చెత్త నుంచి ఎరువుల తయారీ కేంద్రాలను సందర్శించారు. మొక్కలను నాటారు. షెడ్లలో తయారు చేసిన వర్మీ కంపోస్టును విక్రయించడం, షెడ్ల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రాలు పాల్గొన్నారు.

రేపు మహిళలకు ఉచిత ఓపీ

గుంటూరు మెడికల్: ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8న మహిళలందరికీ ఉచిత ఓపీ సేవలను అందించనున్నట్లు ఆధునిక మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కడియాల శిల్ప సింధూర తెలిపారు. నగర మహిళలంతా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆమె కోరారు.

నిరంతర కృషితోనే లక్ష్య సాధన



హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో పదో తరగతి విద్యార్థులు

చేబ్రోలు: మండలంలోని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు సాదరంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు ఎం. ఏడుకొండలు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకొని దాని సాధన కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. 174 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్ష రాయబోతున్నారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధనకు సబ్జెక్టు ఉపాధ్యాయులతో విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి అదనపు క్లాసులు నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించటానికి పాటించాల్సిన మెళకువలను తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవీలత, రాజారెడ్డి, సీహెచ్. నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, ప్రసాద్, శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్ నియామకాల్లో వీవీఐటీ విద్యార్థినుల సత్తా



ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్

పెదకాకాని: ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ అకాడమీతో కలసి ఇంజనీరింగ్ విదార్థినులకు ఇన్ఫోసిస్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో వీవీఐటీకి చెందిన 88 మంది ఎంపికైనట్లు చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని కళాశాలలో చైర్మన్ మాట్లాడుతూ ప్రముఖ ఐటీ సేవల దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో గ్రామీణ నేపథ్యం యువతులు అధికంగా ఉద్యోగాలు పొందడం సంతోషం కలిగించిందని తెలిపారు. సంస్థ రూ. 3.6 లక్షల నుంచి రూ. 9.5 లక్షల వరకూ వార్షిక వేతనం కేటాయించినట్లు చెప్పారు. కళాశాలలో తొలి ఏడాది నుంచే పరిశ్రమ అవసరాలకు తగ్గట్టు అత్యాధునిక సాంకేతిక అంశాలలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని చైర్మన్ తెలిపారు. అనంతరం నియామకాలు పొందిన విద్యార్థులను ప్రిన్సిపాల్ వై. మల్లికార్జునరెడ్డి, డీన్ అకడమిక్ కె. గిరిబాబు, డీన్ ప్లేస్మెంట్ ఎం.వి. రఘురామ్, ఉపాధికల్పన, శిక్షణా విభాగాధిపతి మాధవ్, అధ్యాపకులు అభినందించారు.

సర్టిఫికెట్ కోర్సులతో నైపుణ్యాన్ని పెంచుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హనుమంతరావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు ఫార్మసీ డిగ్రీతో పాటు సర్టిఫికెట్ కోర్సులను చదివి, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని విశ్రాంత ఔషధ నియంత్రణ మండలి అధికారి డి. హనుమంతరావు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గురువారం ఫార్మసీ పితామహుడు ప్రొఫెసర్ మహదేవ్‌లాల్ ష్రాఫ్ జయంతి సందర్భంగా జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవాన్ని ఫార్మా అన్వేషణ్-2005 పేరుతో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హనుమంతరావు మాట్లాడుతూ ఫార్మసీ నిపుణులు ఔషధ రంగంతో పాటు సౌందర్య సాధనాలు, ఆయుర్వేద ఔషధాలు, స్పైసెస్ తయారీకి చిన్న తరహా పరిశ్రమలను ప్రారంభించాలని సూచించారు. వ్యవస్థాపకులుగా ఎదిగి మరి కొంత మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. కళాశాల పాలకమండలి అధ్యక్షుడు జూపూడి రంగరాజు మాట్లాడుతూ మన దేశంలో మొదటిసారిగా బనారస్ హిందూ విశ్వ విద్యాలయంలో అప్పటి వీసీ మదన్ మోహన్ మాళవ్యా పర్యవేక్షణలో ప్రొఫెసర్ మహదేవ్ లాల్ ష్రాఫ్ బీఎస్సీ ఫార్మసీ కోర్సును ప్రవేశపెట్టారని తెలిపారు. తరువాత రాజస్థాన్‌లోని బిట్స్ పిలానీ, జాదవ్‌పూర్ వర్సిటీలు ఫార్మసీ కోర్సులను ప్రారంభించినట్లు వివరించారు. కళాశాల పూర్వ చైర్మన్ డాక్టర్ ఎం. రాధాకృష్ణమూర్తి ప్రొఫెసర్ మహదేవ్ లాల్ ష్రాఫ్ జీవిత చరిత్ర, విద్యాభ్యాసం, ఫార్మసీ రంగంలో ప్రారంభించిన అసోసియేషన్లు, ప్రచురించిన పాఠ్య పుస్తకాలు, పత్రికల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎస్. మధుసూదనరావు, హిందూ పీజీ కళాశాల ఎంబీఏ విభాగాధిపతి రమణ, విజ్ఞాన్ వర్సిటీ ఫార్మసీ ప్రాక్టీసు డీన్ జి. సతీష్, కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీ నాగభూషణం, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలి



ఆహ్వాన పత్రాలు ఆవిష్కరిస్తున్న రెంటాల కుమారి, శ్యామల తదితరులు

లక్ష్మీపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గుంటూరు కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న జిల్లాస్థాయి సదస్సులో మహిళలంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రెంటాల కుమారి తెలిపారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళల హక్కులు సాధించుకునేందుకు నిరంతరం ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య పాటుపడుతోందని తెలిపారు. మహిళలు, చిన్న పిల్లలపై అత్యాచారాలు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నెలకు రూ. 15వేలు ఆర్థిక సాయం, మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్నారు. మొదటి విడతలో కొంతమందికి మాత్రమే ఇచ్చారని విమర్శించారు. తల్లికి వందనం పేరుతో తల్లిదండ్రులని కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని తెలిపారు. శనివారం జరిగే సదుస్సులో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, ఐఏఎల్ వర్కింగ్ ప్రెసిడెంట్ జేఎస్ఆర్, డాక్టర్ పుష్ప ప్రియాంక, డీఎల్ఎఫ్ ప్యానల్ అడ్వకేట్ గోనుపు శ్యామల, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరేటి రామారావు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలో మహిళలందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు.

రేపు ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల వార్షికోత్సవం

గుంటూరు రూరల్: చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల 40వ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని తెలిపారు. కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కళాశాల నలభై ఏళ్ల విద్యా ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసిందని చెప్పారు. విద్యనభ్యసించిన విద్యార్థులు దేశ, విదేశాల్లో వివిధ రంగాల్లో కీలక హోదాల్లో సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభతో పాటు, కళాశాల విద్యారంగంలో జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంకులను సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. వేడుకలకు ముఖ్య అతిథిగా ఇన్ఫోసిస్ డీఎమ్ సురేష్ నర్రా, విశిష్ట అతిథిగా తెలుగు సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ పాల్గొనున్నారని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా కళాశాలలో అర్హులైన 317 మంది విద్యార్థులకు రూ. 20 వేల చొప్పున, మొత్తం రూ. 63.40 లక్షలను అతిథుల చేతుల మీదుగా అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

డిగ్రీ ఫలితాల్లో శ్రీమేధ, కెరీర్ కళాశాలల విద్యార్థులు ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ప్రకటించిన 2024-25 డిగ్రీ ప్రథమ సెమిస్టర్ ఫలితాల్లో శ్రీమేధ-కెరీర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపి, యూనివర్సిటీ స్థాయిలో టాపర్లుగా నిలిచినట్లు సంస్థ డైరెక్టర్లు శేషసాయిబాబు, అన్నా నందకిశోర్ తెలిపారు. కొత్తపేటలోని సంస్థ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. బీకాం జనరల్ విభాగంలో పాలక్ జైన్ 550 మార్కులకు గాను 493, ఫలక్ జైన్ 483, కె. దినేష్ 467, జి. దివ్య తేజస్వి 465, ఆకాష్ 462 మార్కులు సాధించినట్లు వివరించారు. బీకాం కంప్యూటర్స్‌లో ఎస్. ఆదిత్య వర్ధన్ 550 మార్కులకు గాను 438, లక్షిత జైన్ 424, ఎస్. ధనుష్‌కుమార్ రెడ్డి 411, ఎస్. అంకమ్మరావు 408, జి. ఆనంద్ 400 మార్కులు సాధించారని తెలిపారు. రెగ్యులర్‌గా తరగతుల నిర్వహణ, నిరంతర పర్యవేక్షణ, ల్యాబ్ ప్రాక్టీసు కారణంగా టాప్ మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. అత్యుత్తమ మార్కులను సాధించేందుకు కృషి చేసిన విద్యార్థులతో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు.

అబాకస్‌లో భారతీయ విద్యాభవన్ విద్యార్థుల సత్తా



గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో భారతీయ విద్యాభవన్ విద్యార్థులు సత్తా చాటారని పాఠశాల ప్రధాన కార్యదర్శి పి. రామచంద్రరాజు తెలిపారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని విశ్వం ఎడ్యుటెక్ ఈనెల 2వ తేదీన నిర్వహించిన జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో తమ పాఠశాల 4వ తరగతి విద్యార్థి కె. కార్తికేయ ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ చేతుల మీదుగా రూ.ఐదు వేల బహుమతి అందుకున్నట్లు వివరించారు. 5వ తరగతి విద్యార్థి జి. కిశోర్ కుమార్ కన్సొలేషన్ బహుమతి పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల కోశాధికారి కె. రామ్ సుభాష్, ప్రిన్సిపాల్ హేమాంబ, హెచ్‌ఎం కృష్ణ ఉషశ్రీ, ఉపాధ్యాయులు అభినందించారు.

నూరు శాతం పన్నుల వసూళ్లే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

పొన్నూరు: పట్టణంలో ఈ నెల 15వ తేదీ నాటికి నూరు శాతం పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు అధికారులకు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. పన్నుల వసూళ్లపై సమీక్షించారు. అధిక మొత్తంలో బకాయిలు ఉండడంతో అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పన్ను చెల్లింపుదారులు వెంటనే బకాయిలను చెల్లించాలని, లేనిపక్షంలో 16వ తేదీ నుంచి ఆస్తులను సీజ్ చేయడంతో పాటు వారి జాబితాలను బహిరంగ ప్రదేశాలలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. నీటి కుళాయిలను, డ్రైయిన్ కనెక్షన్లను తొలగించాలని సిబ్బందికి సూచించారు. ఈ నెలలో సెలవు రోజుల్లో కూడా క్యాష్ కౌంటర్లు యథావిధిగా పని చేస్తాయని ఆయన తెలిపారు. పన్నులను మున్సిపల్ ప్రధాన కార్యాలయంతో పాటు, పట్టణంలోని 17 సచివాలయల్లో చెల్లించవచ్చని ఆయన సూచించారు. సమావేశంలో మున్సిపల్ ఆర్వో తోట వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పశు పోషకులకు ఉచితంగా మందుల పంపిణీ



మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ స్మిత్

రేటూరు(కాకుమాను): కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను రైతులు, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల జిల్లా ఎన్‌టీఆర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.డి.స్మిత్ తెలిపారు. మండలంలోని రేటూరులో గురువారం కళాశాల ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్మిత్ మాట్లాడుతూ ఏటా కళాశాల ఆధ్వర్యంలో రెండు గ్రామాలను ఎంచుకుని ఫైనల్ ఇయర్ ఇంజినీరింగ్ విద్యార్థులతో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది మండలంలోని రేటూరు, అప్పాపురం గ్రామాలను ఎంచుకుని గత మూడు రోజులుగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పశువులు, గొర్రెలు, మేకలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. రైతులకు సాగు విషయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు గురించి వివరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పశువైద్యులు శేఖర్, శైలజ, సౌమ్య, కళాశాల ఎన్‌సీసీ కో-ఆర్డినేటర్లు విజయ్ కుమార్, కె.లావణ్య, ఆరుద్ర, వెంకటేశ్వర్లు, ఇంజినీరింగ్ విద్యార్థులు, పశుపోషకులు పాల్గొన్నారు.

వైభవంగా మహాశాంతి అభిషేకం



ప్రత్యేక పూజల్లో కమలానంద భారతీ స్వామి, పరమాత్మ నందగిరిస్వామి

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అష్టబంధన మహా సంప్రోక్షణ సమేత మహా కుంభాభిషేక మహోత్సవాలు ఆరో రోజుకి చేరాయి. కలశారాధన చేసి ఆలయ శిఖరానికి చేరి విశేష పూజలతో స్థాపన చేశారు. శ్రీ పద్మావతి, శ్రీ గోదాదేవి, శ్రీ వెంకటేశ్వరస్వామి, గరుడళ్వార్లకు మహాశాంతి అభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూల విరాట్లకు వెయ్యి లీటర్ల పాలు, 500 లీటర్ల పెరుగు, వంద కొబ్బరి బొండాలు, పలు రకాల సుగంధ ద్రవ్యాలతో వైభవంగా అభిషేకాలు నిర్వహించారు. టీటీడీ ఆగమశాస్త్ర పండితులు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు, అగ్నిహోత్ర శోభనాచల లక్ష్మీ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో కుంభారాధన, విశ్వక్సేనారాధన, పుణ్యావచన, ఉక్తహోమం, సుదర్శన్ హోమం, మూర్తి హోమం, శాంతి హోమం, పూర్ణాహుతి జరిగాయి. కమలానంద భారతి స్వామి, పరమాత్మ నందగిరిస్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. సాహితీవేత్తలు నిష్ఠల సుబ్రహ్మణ్యశాస్త్రి, మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి, యాబలూరి లోకనాథ శర్మలు మహాకుంభాభిషేక విశేషాలను, బ్రహ్మోత్సవాల విశిష్టతను వివరించారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ నిర్వాహకులు బొల్లేపల్లి సత్యనారాయణ, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులు లంక విజయబాబు, సూర్యదేవర వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం పద్మావతి కల్యాణ మండపం ప్రాంగణంలో చండీ హోమం భక్తశ్రద్ధలతో నిర్వహించారు.

రేపు సినీ సంగీత విభావరి

నగరంపాలెం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మహిళా సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఎస్ ఈవెంట్స్ వ్యవస్థాపక అధ్యక్షురాలు మునిపల్లె రమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి రోడ్డులోని శ్రీ అన్నదాన సమాజం ఆడిటోరియంలో సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమవుతుందని ఆమె పేర్కొన్నారు. సంగీత ప్రియులు హాజరుకావాలని ఆమె కోరారు.